
# క్షమ మన్నిం



## దినకర్

"డ్రైవర్! కారాపు" అంది ఉన్నపళాన రాగిణి.

డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేశాడు. అదిరి పడి నిద్రనుండి లేచింది మాణిక్యాంబ.

"ఏమయిందమ్మా! ఎందుకు కారాపటం?" నిద్రమత్తులోండే అసహనంగా అడిగిందామె.

అర్ధరాత్రి దాటిన సమయం. నిర్మామష్యంగా వున్నా జాతీయరహదారి. ఏదో కాల్వ ఒడ్డు. ఎక్కడో దూరంగా మినుకు మినుకుమంటూ, మంచు కప్పి వుంటం వల్ల నందివర్ధనం పువుల్లా కనిపిస్తోన్న వీధిదీపాల వరుసలు.

చుట్టూ ఏవేవో తోటలు. చలిగాలులు రివ్వున వీస్తున్నాయి. కారుతలుపు అద్దం కాస్త కిందకు దించగానే చల్లగాలి తెమ్మెర ఒకటి రాగిణి ముఖం ముద్దెట్టుకుంది.

ఆ పిల్లతెమ్మెర అనుభూతికన్నా రాగిణి చెవుల్లో మరేదో నాదం బలంగా దూరి ఆమెని కారునుండి కిందకు లాగింది.

"ఆ: అదేవిటే! రాగూ! ఎక్కడికే! డ్రైవరూ! నువు పదవయ్యా! అయ్యో! నేనొక్కత్తినే కామా... నేనూ వస్తా పద! అమ్మో! మరి కారూ... కార్లో... అన్నీ... ఏమిటీ దీని పిచ్చి! అమ్మా! రాగూ... రాగిణీ... ఆగవే..." కార్లో నుండే మొత్తుకోసాగింది మాణిక్యాంబ.

అప్పటికే డ్రైవరూ, మాణిక్యాంబల పిలుపు అందనంత దూరం, తన చెవిలో వినవస్తూన్న నాదం ప్రసరిస్తూన్న దిశగా వెళిపోయింది రాగిణి. చేతులకూ చెవులకూ మెడలోనూ ఖరీదైన ఆభరణాలు వున్నాయి.

పొడవాటి ఉన్ని శాలువా భుజాల మీదుగా జారగప్పుకొని నడవసాగింది రాగిణి.

తిన్నగా ఆమె కాళ్ళు ఓ అరటితోట పక్కగా తీసుకువెళ్ళాయి. అక్కడో పెద్ద మోటబావి. పక్కనే మోటారుంచిన చిన్న గూడిల్లు. దాని నానుకొని ఓ చిన్నకొట్టం. వెళ్ళి ఆ కుటీరం వాకిలిముందు నిలిచింది రాగిణి.

కుటీరంలో లోపల అతి చిన్న మట్టి దీపం వెలుగుతోంది.

దానిముందో చింకిచాప మీద అరడుగుల బక్కచిక్కిన వ్యక్తి ఒకాయన కూచోనున్నాడు. వయోభారం స్పష్టంగా అతని శరీరాంగాలన్నిటిలోనూ సాక్షాత్కరిస్తూనే వుంది. బంతిపోగు జందెం ఆచ్ఛాదనలేని శరీరంమీద వేలాడుతోంది. ఏదో స్తంభాని కానుకున్నట్లు, కూచోనున్నా, రెండుచేతులూ రొమ్ముమీదకానించి బిగువుగా కూచోనున్నా శరీరం ముందుకు వాలే వుంది. ముఖంలో ఆకలీ దైన్యం ఆవేదనా గుంతలు కలిసి కొలువుచేశాయి.

కట్టుకున్న ఏనాటి జరీ అంచు పాత ధోవతీ చిరుగుతో మోకాళ్ళవరకే చలీ చాలక వుంది.

కళ్ళు మూసుకునున్నాయో, తెరుచుకునున్నాయో అవుపించటంలేదు. ఆ బక్క-జీవి నోటినుండి వస్తూ వుంది ఓ అపూర్వ కీర్తన.

"నాదాత్మను మనిశం శంకరం" అంటూ ఆ వృద్ధమూర్తి పాడుతూన్న కీర్తనకు, అందులోని రాగభావచ్ఛాయకూ ముఖ్యంగా అతని గొంతులోని మార్దవానికీ మంచు కరిగి గగనంనుండి కురుస్తూ వుందేమో అన్నట్లుంది.

అతనివైపే చూస్తూ, ఆ కీర్తనే వింటూ ఆ వాకిటే నిలచిన రాగిణి ఎంతసేపు నిలిచిందో ఆమెకే తెలియలేదు.

ఆ వృద్ధమూర్తి కీర్తన పాడడం ముగించి, "రామా! ఆపద్బాంధవా! ఇంకా ఎందుకయ్యా నన్నిలా కష్టపెడతావు. నన్ను కడతేర్చు... నాకీ శిక్ష చాలు రామా!" అంటూ తనివిదీరా ఏడ్చాడు.

రాగిణి పరుగున లోపలికి వెళ్ళింది. తనమీది శాలువా ఆ వృద్ధమూర్తి శరీరం నిండా కప్పి పొదువుకుంది. అతని భుజాలమీద తన తలానించి కన్నీరు మున్నీరుగా ఏడ్చేసింది.

"ఎవరు? ఎవరిది! ఎవరిది?" అంటూ తడుముతూ తచ్చాడుతూ రాగిణి ఒళ్ళంతా తడిమి బిత్తరపోయాడు.

"ఎవరు? ఎవరు నీవు? ఏమిటీ పని?"

"మామయ్యా! నేను... నేను..." అంటూ మరీ మాటలులేక ఒళ్ళో తల దాచుకుంది రాగిణి

ఆ పిలుపు వినగానే ఉలికిపడ్డాడు వృద్ధమూర్తి. మళ్ళీ ఓమారు రాగిణి శరీర మంతా తన శల్యశరీరంతో తడిమాడు.

"రా...గి...ణీ!" అన్నాడు. అతని కళ్ళు వర్షిస్తూనే ఉన్నాయి

* * *

ట్రెయిన్ కోసం ఎదురుచూస్తూ సంగీతరావు ప్లాట్‌ఫాంమ్‌లో ఓ బెంచీ మీద కూర్చున్నాడు. సామాన్యంగా బస్టాండుల్లోగానీ, రైల్వేస్టేషన్లలో కానీ పార్కులో కానీ జనానికి దూరంగా ఏకాంతంగా కూచోవటం సంగీతరావు అలవాటు

అలవాటు ప్రకారమే మసకవెలుతురు ప్రసరిస్తూన్నచోట కూర్చున్నాడు అతను. అనుకోకుండా అతని కళ్ళు మరో మూలకు చూచాయి. ఓ నలభైయేళ్ళావిడా, మరో పన్నెండు పదమూడేళ్ళ అమ్మాయి బిక్కుబిక్కుమంటూ ఓ స్తంభంచాటున ముడుచుకు కూర్చున్నారు.

తానువచ్చి అక్కడ కూచున్నప్పటికే వాళ్ళక్కడ కూచునే వున్నట్లు చూచిన గుర్తువచ్చింది సంగీతరావుకి. ఆ మసక దీపాల కాంతిలోనే ఆ యిద్దరాడవాళ్ళ ముఖాలలో దైన్యం కొట్టవచ్చినట్లు అవుపిస్తూంది.

జాలిగుండె గల సంగీతరావు మనసు కరగ నారంభించింది.

ఒకటిరెండుమార్లు వారివైపు చూచాడు. తన వాచీకేసి చూసుకున్నాడు. తను వారిని చూచినపుడల్లా వారూ ఏదో తనని అభ్యర్థిస్తోన్నట్లుగా చూచినట్లు భావించి మరీ కరిగిపోయాడు.

చిన్నగా లేచి స్టేషన్ మాష్టారున్న గదివద్దకు వెళ్ళాడు.

"అమరావతి లేటా సార్?" అడిగాడు

"అవునండి! ఇప్పుడే మెసేజ్ వచ్చింది. గుంతకల్ వద్ద ఫిష్‌ప్లేట్లు తొలిగాయట. అవి బిగించాక గానీ బయలుదేరదు. ఒక గంట లేటు" జవాబు.

అప్పటికి తానో గంట ముందు వచ్చాడు సంగీతరావు. లేటువార్త విని మరీ నీరసపడిపోయాడు. నెమ్మదిగా తాను ముందు కూచున్న బెంచీవద్దకే వెళ్ళి నిలిచి ఆ మూలకు చూశాడు. వాళ్ళక్కడే వున్నారు.

చిన్నగా అడుగులు వారివైపు సాగించాడు.

"అమ్మా! ఎవరో ఆయనిటే వస్తున్నా రమ్మా!" చిన్నమ్మాయంఠం వినిపిస్తూనే వుంది సంగీతరావుకి.

ఆ తల్లి వస్తున్న సంగీతరావు వైపు చూచింది.

మనిషి చాలా పొడవరి. పిల్క లాల్చీ పైజామా వేసుకొన్నాడు. ఓ చిన్న శాలువా భుజంమీద వేలాడుతోంది. కాస్త బట్టతల. కళ్ళద్దాలు; మనిషి దబ్బపండు ఛాయే. ఏభైకి పైనే వయసుండవచ్చు. చంకనో ఖాదీపంచీ వేలాడుతోంది. నన్నని పాదాలకు పల్చటి పాదరక్షలు


"వయసొచ్చినా ఎవరో పోకిరిలానే వుంది" అనుకుంది ఆవిడ.

అనుకునేసరికే సంగీతరావు వారి దగ్గరగా వచ్చి నిలిచాడు. చిన్నమ్మాయి భయంభయంగా తల్లి వెనకాల ఆనుకు కూచొని ఇంతలేసి కన్నులతో తలెత్తి ఆ పొడవరిని చూడసాగింది.

"చూడండమ్మా! చాలా సేపుగా మీ రిక్కడే కూచున్నారు. ఏ వూరెళ్ళాలి? టికెట్ తీసుకున్నారా?"

పలుకులో సౌమ్యత చూచి కొంచెం కుదుటపడింది. 'అయినా దగుల్బాజీలు ఇలానే తియ్యగా మాట్లాడతారు' అని అనుకుంది. అయినా అడిగాక చెప్పక పోతే ఏం బావుంటుంది?

"ఏ ఊరని వెళతాం అన్నగారూ! మా బ్రతుకు ఇలా తగలడుతూంటే!" అంది దీనంగా.




"అంటే? ఎక్కడికి వెళ్ళాలనుకో కుండానే స్టేషన్‌కి వచ్చారా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"కాదన్నగారూ! టికెట్ లేకుండా గుంటూర్లో ఎక్కాం రైలు. ఇక్కడ దించేశారు పాయంత్రం. ఎక్కడికని వెళ్ళగలం? మా గోడెవరికి పడుతుంది? ఎవరికని చెప్పుకోగలం? అసలెలాని చెప్పగలం? జనం నమ్మవద్దా? మా ఖర్మ .." అందావిడ కళ్ళు వత్తుకుంటూ.

"మీ పేరేమి చెల్లెమ్మా?" మరీ సౌమ్యంగా ఆప్యాయంగా వరుసకలిపి అడిగాడు. ఆ పిలుపుతో ఆమెకి గుండె చెరువే అయినట్లు కనిపించింది అతనికి.

"మాణిక్యాంబ! ఇది నా చిట్టితల్లి రాగిణి!" అంటూ వళ్ళోకి లాక్కుని అక్కున కరుచుకుంటూ చెరగద్దుకుం దావిడ.

"కొంచెం వుండండిక్కడే చెల్లాయ్" అంటూ టికెట్ కౌంటర్ వద్దకు వెళ్ళి టికెట్ వాపస్ చేశాడు.

మళ్ళీ తిరిగి వాళ్ళవద్దకి వచ్చాడు.

"లెండమ్మా! వెళదాం రండి" అన్నాడెంతో జాలిగా.

అనుమానంగా అయోమయంగా అతని వైపు చూసింది మాణిక్యాంబ.

"అన్నగారూ... మీరు... ఎక్కడికో ప్రయాణం..." నసిగింది.

నవ్వాడు వేదాంతిలా సంగీతరావు.

"రావమ్మా! అమాయకులూ ఆడవాళ్ళూ ఏ ఆసరా లేకుండా వున్నవాళ్ళూ నా మనసులో మెదలుతూంటే నా ప్రయాణమో మరో పనో సాగుతాయా? మీ సంగతేమో వినాలా? ఒక మార్గం చూడాలా? తర్వాతే నా సంగతి. రండి."

ఓ జట్కాలో ముగ్గురూ బయలుదేరి వెళ్ళారు.

సంగీతరావు ఇంటిముందు జట్కా ఆగింది. రాత్రి పన్నెండు గంటల సమయం కావటంతో ఎవరో ఒకరిద్దరు తప్ప ఆ జట్కా వచ్చిన సంగతి మరెవరూ గమనించనే లేదు.

జట్కా ఛార్జీ యిచ్చి దాన్ని పంపి వేశాడు. తానే తలుపులకి వేసిన తాళం తీస్తూంటే మళ్ళీ అనుమానంగా అతని వైపు చూచింది మాణిక్యాంబ.

సంగీతరావదేమీ గమనించలేదు. తలుపులు తీసి లోపల లైటు వెలిగించి, "రండమ్మా! రా పాపా!" అని ఆదరంగా ఆహ్వానించాడు.

మనసు నిండా భయసందేహాలతో అడుగుదీసి అడుగుగా లోపలికి నడిచింది రాగిణితో మాణిక్యాంబ.

ఇంట్లోకి అడుగు పెట్టగానే ఆమె ముఖంలో మందహాసచంద్రికలు వెలిగాయి. ఆ సంతోషాన్ని చూపులతోనే కూతురు రాగిణికి అందించింది. ఆ పాప ముఖం చేటంత తామరలా విరిసి తల్లిని గట్టిగా పొదువుకొంది.

ఇల్లు చిన్నదే అయినా శుభ్రంగా వుంది. అందుకాదు. ఎదురుగా ఒక ఎత్తయిన అరుగు. దానిమీద ఓ మూలకు తంబూరా, ఫిడేలు, మృదంగం అవుపించాయి. గోడకు త్యాగరాజు, అన్నమయ్యల చిత్రపటాలూ, పాత కొత్త ప్రముఖ సంగీత విద్వాంసుల కచేరీ ఫోటోలు అలంకరింపబడ్డాయి.

అన్నిటికన్నా మరీ ముఖ్యంగా ఓ పెద్దఫోటో! అందులో మైకుముందు కూచున్న సంగీతరావు. ప్రక్కా ప్రక్కా వాద్యాలు.

"మీకు సంగీతమూ వచ్చా అన్నగారూ!" పరమాశ్చర్యంగా అడిగింది మాణిక్యాంబ.

"నా పేరే సంగీతరావు చెల్లాయ్! అవన్నీ మళ్ళీ మాట్లాడుకోవచ్చు గానీ ముందా పెట్టే సంచీ ఆ గదిలో వుంచుకోండి. అక్కడవతల బాత్‌రూం, ఇదిగో

యి దే వంటిల్లు. ఎప్పుడు తిన్నారో ఏమో! శుభ్రంగా కాళ్ళూ ముఖమూ కడుక్కు రండి. చిరుతిళ్ళవలు ఎప్పుడూ కలిపి వుంచుకుంటాను నేను. ఎమర్జెన్సీ టిఫిన్ కోసం. కాస్త అదే సాపడి రండి! తర్వాత విశ్రాంతిగా నిద్రవచ్చేవరకూ కూచోవచ్చు" అన్నాడు.

మాణిక్యాంబ అలాగే చేసింది.

తలుపులు వేసివచ్చి వాలుకుర్చీలో ఒళ్ళు వాల్చాడు. సంగీతరావు ఎదురుగా మాణిక్యాంబ. ఒళ్ళో రాగిణి.

"ఆయనగారున్నట్టుండి అదృశ్య మయ్యా రన్నయ్యా! తలకు మించిన అప్పులు! ముందూవెనకా ఎవరూ లేని ఏకాకులం. రాగిణికి అప్పటికి సంవత్స రమే. ఈ పన్నెండేళ్ళు ఇల్లు నమ్మి అప్పులు తీర్చగా మిగిలిన పైకంతో గడుపుతూవచ్చాము. రాగూకి భగవంతుడు చక్కని కంఠం ఇచ్చాడన్నయ్యా! సంగీతం నేర్పి అలా దీన్ని గొప్పదాన్ని చేసి ఏదో ఒక విధంగా దీని బ్రతుకు సంపన్నం చేద్దామని ఆశ. విజయనగరం వెళ్ళాను. విజయవాడ వచ్చాము. వెధవ లోకం కదూ! నా పాప గొంతు చూచిన వాళ్ళెవరన్నయ్యా! అందరి పాపిష్టికళ్లూ నామీదే. వెధవ షొద్దులు చెప్పి రాగిణికి సంగీతం చెప్పే విషయమే దాటవేశారు. మద్రాసైనా వెళదామని బయలుదేరా. కానీ... చేత పైసాలేదు. తిండికే కటా కటీ... ఇదీ పరిస్థితి... మా అదృష్ట మేదో కాస్త ఇంకా వుంది కనకే మీరు దైవంలా అవుపించా రన్నయ్యా!" అంటూ అసురుసురై ఏడ్చింది.

సంగీతరావు మరేమీ మాట్లాడలేదు. వాలుకుర్చీలోంచి నిటారుగా కూర్చు న్నాడు. మౌనంగా మాణిక్యాంబ వైపు చూచాడు. ఒళ్ళోదగా వంచనా కుత్సితం తెలీని శుద్ధప్రేమస్వరూపంలా చిరు నవ్వుతో నిద్రపోతున్న రాగిణి.

లేచి నిలబడ్డాడు. నెమ్మదిగా మాణి క్యాంబవద్దకు నడిచాడు. ఆవిడ బెదిరిపో సాగింది. అతను ముందుకి వంగాడు. ఆమె శరీరంలో నరనరమూ స్వేదాన్ని చిమ్మసాగింది

సంగీతరావు తన కుడిచేత్తో నిద్ర పోతున్న రాగిణి తల నిమిరాడు.

"పాపని తీసుకు ఆ గదిలో వెళ్ళి పడుకో చెల్లాయ్; లోపల గడి వేసుకో! కిటికీలు తెరుచుకో! గాలాడకపోతే ఫ్యాన్ వేసుకో! వెళ్ళు!" అని సోఫాలోకి వెళ్ళి పడుకున్నాడు.

దిగ్భ్రమలోంచి మాణిక్యాంబ పది నిమిషాలకి గానీ తేరుకోలేదు. సంగీత రావు నిలిచిన చోటుని స్పృశించి కళ్ళ కద్దుకుందామె.

పొద్దు పొడిచింది.

అదీ సంగీతరావింటి ముందే పొడిచింది.

తెల్లవారేసరికి సంగీతరావున్న వీధి మొత్తంలో అచ్చం తెలుగుతనం వెల్లి విరిసింది.

"మా చెల్లాయి. కొన్ని యేళ్ళుగా మాకు రాకపోకలు లేవు. మా బావగారు మతిచెడిపోయారు. ఎక్కడికి వెళుతుంది? నా పంచనే చేరింది" అని అడక్కుండానే సంజాయిషీ చెప్పుకున్నాడు సంగీతరావు.

అయినా నోరు నొక్కుకున్నారు. నొసట వెక్కిరించారు. సర్మగర్భంగా మాట్లాడుకొన్నారు. ముసిముసినవ్వులతో ఆత్మానందం అనుభవించారు.

వారం తిరక్కుండానే సంబంధం అంటగట్టేశారు.

అయినా సంగీతరావు పట్టించుకో లేదు. శుభముహూర్తం చూసి రాగిణికి సంగీతపాఠం ప్రారంభించాడు.

"అన్నయ్యా! లోకం నోరు మూయిం చటం మన వశంకాదు వదిన్ని పిలుచుకుని రారాదూ? ఊరెళ్ళి నాల్రోజులైనట్టుంది!" అందొకనాడు మాణిక్యాంబ.

సంగీతరావు నవ్వుతున్నాడు. "నేను బ్రహ్మచారినమ్మా! ఎక్కడుందని తేగల్ను?" అన్నాడు.

మౌనంగా తల వాల్చింది మాణిక్యాంబ. 'ఇన్నేళ్ళుగా లేనిది ఇవాళ ఉంటుందని ఈలోకం ఎలా అనుకో గలుగుతోందో?' అని తనలోనే మథన పడిపోయింది.

మరో విశేషం జరిగింది.

వార్త మరోరకంగా వ్యాపించటం వల్లో మరే ఇతర కారణానో సంగీత రావువద్దకి వచ్చే సంగీతపాఠాలు నేర్చుకునేవారు రావటం మానివేశారు. కచేరీలు జరగటం నామమాత్రమైపోయింది. శాస్త్రీయసంగీతం అంటే మోజుచూపే జనమే కరువైపోసాగింది. రేడియో ప్రోగ్రాము ఎప్పుడో కాని రాదు.

బండిదొర్లడం గగనం కాసాగింది సంగీతరావుకు. మాణిక్యాంబ అతని తపనా శ్రమా చూస్తూ తల్లడిల్లి పోసాగింది.

"అన్నయ్యా? మాదారి మేం చూసు కుంటాం. అనవసరంగా నీ కి అపకీర్తి, అవస్తా, వచ్చే ఆదాయం పోవటమూ ఎందుకులే అన్నయ్యా!" అందోనాడు.

"ఏమ్మా! నిజంగా నాకో చెల్లాయుండి ఇలా నా పంచనే చేరివుంటే నా కీ శ్రమ తప్పేదా? పిచ్చితల్లీ! నీకేం బరువయ్యిం దమ్మా! మనమేం తిండిలేక పస్తు లుండటం లేదు కదా? అలా పస్తుండే రోజున్నే వెళిపోదురుగానిలే! గాన కోకిలగా సంగీతస్వరాల్ని ఒలక పోస్తున్న రాగిణిని సంగీత ప్రపంచం అదిరిపోయేలా తీర్చిదిద్ది; నిన్ను తిరస్క రించి గేలిచేసి వెటకారంగా మిటకరించన చోటే తొలి కచేరీ యిప్పించి అదరగొట్టే వరకూ నే నూరుకోనమ్మా. నా శరీరం ఏమన్నాగానీ..." అని ఆవేశంతో అంటూ అంటూనే వెంటనే "నాదా... త్తనుమనిశం...శంకరం" అంటూ తన్మ యుడై పాడసాగాడు.

ఆ సహజావేశస్ఫురితమైన స్వర



స్వరూపం చూచి యౌవన ప్రాంగణంలో అడుగిడుతున్న రాగిణి చలించిపోయింది. ఆవిడే కాదు. మాణిక్యంబే కాదు. వీధి వీధంతా తన్మయమైపోయి ఆ కీర్తన విని కదలిపోయింది.

"ఎంతయినా సంగీతరావు సంగీతరావేనయ్యా! మన రాయలసీమకే రత్నం. కాకపోతే..." అని పుల్ల విరుస్తూనే అనుకుంది జనం.

అన్నట్లుగానే రాగిణి పదిహేడో ఏట విజయవాడ సంగీత సభలలో తొలికచేరీ అవకాశం ఏర్పాటు చేశాడు సంగీతరావు.

దక్షిణాది దిగ్గంతులందరూ కచేరీలు చేసిన సంగీత సభ అది. వారందరి సమక్షంలోనూ తొణుకుబెణుకు లేకుండా ముగ్ధ మనోహరంగా గమకాలు పంగి

తులతో అందరి తలలూ ఊగేలా పాడింది రాగిణి

వార్తాపత్రికల నిండా రాగిణి ఫొటోలూ ప్రశంసలే. రాయలసీమ కూడా సంగీత కళకు కాణాచేనని సంగీతరావు ఋజువుచేశాడనీ పొగడ్తలే.

క్రమక్రమంగా రాగిణి సోపానాధిరోహణం చేస్తూ సంగీతంలో అత్యున్నత శిఖరాలను చేరసాగింది. వయోభారం ఎక్కువవుతూన్న సంగీతరావు ఆమె కార్యక్రమాలను సరిజూచే ఓపికలు లేవి వాదవసాగాడు

"మామయ్యా! ఇంకా నీ కీ శ్రమ యెందుకు? నా పీ.ఏ. అవన్నీ చూసుకుంటాడుగానీ... నీ వూరక విశ్రాంతిగా మా వెంట వుండు" అనేది రాగిణి.

"నిజమేనమ్మా! విశ్రాంతే నా కవసరం. కానీ నీతో వూరూరా తిరిగే ఓపికా లేదమ్మా? నంద్యాల వెళిపోతా. నాలుగు సంగీత పాఠాలు చెప్పుకుంటూ చివరి శ్వాసవరకూ సంగీతమే వివదిస్తూ జీవిస్తానమ్మా!" అన్నాడు.

రాగిణి కదిలిపోయిందా మాటలకి.

"అదేమిటి మామయ్యా! నే నుండగా సంగీత పాఠాలతో జీవించాలా నీవు? అంటే మేం నీకేమీ కామనేగా?" బాధగా కన్నీళ్ళతో అంది.

"అదేం కాదు రాగిణీ! ముందు మీరో స్థాయిలో స్థిరపడాలి. పుష్కలంగా సంపాదించుకోవాలి. ఓ చక్కని భవంతి అందంగా నిర్మించుకోవాలి. తర్వాత నా లాంటి వాళ్ళకి ఆశ్రయమిచ్చినా అవస్థ వుండదు. ఒకవేళ నాకేదేనా అవసరమో అవస్థోవస్తే తప్పకుండా నిన్ను కాకుంటే ఇంకెవర్ని అడుక్కుంటానమ్మా!" అన్నాడు ఆప్యాయంగా సంగీతరావు.

"అడుక్కోవటమా? ఎంత మాట అన్నయ్యా! మమ్మల్ని ఆదేశించి గద్దించి నీ క్కావలసినంతా లాక్కోవచ్చు కానీ" మాణిక్యాంబ ఆదరం తన ప్రతి పలుకులో నింపి అనింది.

"అలాగే కానీలే అమ్మా!"

అంటూ ట్రెయిన్ ఎక్కాడు సంగీతరావు. బరువైన హృదయాలతో, కాన్నలతో తల్లీకూతుళ్ళు సంగీతరావుకు వీడ్కోలు లిచ్చారు ట్రెయిన్ కదులుతూంటే ఇద్దరి కళ్ళలోనూ నీరు మెదిలింది. మీది సెల్లాతో కళ్ళు తుడుచుకుంటూన్న సంగీతరావు వారి చూపుల కందలేదు. అప్పటికే రైలు కదిలిపోయింది దూరంగా.

నంద్యాల చేరిన తరువాత కొంత కాలం రాగిణి నుండి లేఖలు వస్తూనే వుండేవి. క్రమంగా దూరదూర తీరాలలో కచేరీలంటూ ఉండటంవల్ల తాను జాబులు వ్రాయలేకపోతున్నానని వ్రాయటమూ, అసలు జాబులే రాయటం మానివేసింది.

అయినా వార్తా పత్రికల్లో రాగిణి కచేరీల గురించీ, ఆమెకి లభిస్తూన్న ఆదరణా, బిరుద సన్మానాలూ గురించి

పలుమార్లు చూస్తూ తనలో తానే మురిసి పోయేవాడు సంగీతరావు.

ఒకరోజు అనుకోకుండా వచ్చిన బరువైన కవరుని ఆత్రంగా విప్పి చూచాడు.

అందులో ఢిల్లీలో ప్రముఖ విదేశీ అధిపతుల, దేశాధినేతల సమక్షంలో తన అపూర్వ గానప్రతిభ ప్రదర్శించే సువర్ణా వకాశమనీ తప్పకుండా రావలసిందనీ అభ్యర్థిస్తూ ఢిల్లీకి బయలుదేరి రావలసిన రూట్ల వివరాలూ రిజర్వ్‌డ్ టిక్కెట్లూ అవి ఉపయోగించవలసిన రైళ్ళ వివ రాలూ రాగిణి పంపింది.

అవన్నీ సంగీతరావు కన్నీళ్ళతో తడిసి తప్పందుమైపోయాయి

ఏరోజయితే ఢిల్లీలో రాగిణి సంగీత కచేరీ ఉందో ఆరోజే అతని యిల్లు కోర్టు వేలంలో పర హస్తగతమై పోతూంది. రాగిణి ఉజ్వల భవిష్యత్తు కోసం తాను చేసుకున్న దృఢనిర్ణయం అమలుపరచేందుకు చేసిన అప్పుల క్రింద ఆ యిల్లు వేలంపాటకి బలయిపోతూంది.

అయినా ఏదో అభిమానం అడ్డుపడి రాగిణిని 'దేహి' అని యాచించి ఆశ్ర యించేందుకు మనసు రాక మొండి ధైర్యంతో ఇల్లువిడ్చేందుకే సిద్ధపడ్డాడు.

కచేరీలో మునిగిపోయిన రాగిణి ఒక్కో కీర్తన అయిపోయినప్పుడల్లా ప్రేక్షకసమూహంలో విఐపీల సీట్లలో పరిశీలనగా చూచేది సంగీతరావు వచ్చా డేమోనని.

కచేరీ అయిపోయింది. ఢిల్లీదర్బారు హాలంతా కరతాళధ్వనుల వర్షంతో మోగిపోయింది.

ఎందరెందరు ఎన్నెన్ని ప్రశంసలో!

ఎన్నెన్ని విలువైన కానుకలో!

రేడియోలు ఒకటే హోరున వార్తల్లో, ప్రత్యేక వివేదికల్లో రాగిణిని గురించే పుటంకించాయి. సంగీతరావు రేడియో కూడా లేనివాడైపోయాడప్పటికే.

టెలివిజన్లలోనూ ఆ దృశ్యాన్ని ప్రసారంచేశారు. టివి చూడగల స్థాయిని ఎప్పుడో కోల్పోయాయి సంగీతరావు కళ్ళు.

రాగిణికి లభించిన అమూల్యకానుక అమెరికాలో పర్యటనకు సాదరమైన ఆహ్వానం. తమ స్వంతఖర్చుమీద అమె రికా ప్రభుత్వం రెండుదేశాల సాంస్కృ తిక సంబంధాల సమాదరణ పథకంకింద రాగిణిని ఆహ్వానించింది. ఆమె బృందాని కంతా పాస్‌పోర్టులను రెడీ చేసింది కాన్సలేట్ ఆఫీసు.

రాగిణి తన జీవనదాతని మరచి పోలేదు. సంగీతరావు పేరా పాస్‌పోర్ట్ ఇప్పించే విశ్వప్రయత్నం చేసింది.

నంద్యాలకు లైట్నింగ్ కాల్స్ బుక్ చేసింది. ఎక్స్‌ప్రెస్ రిప్లైపెయిడ్ టెలిగ్రాంలు ఇప్పించింది. సంగీతరావు నుండి సమాధానమే లేదు.

అప్పటికే సంగీతరావనే మనిషి వుండేవాడన్న సంగతి నంద్యాల ప్రజలు మరచిపోయారు. అతనెలా ఇల్లిల్లు తిరిగి పాఠాలు చెబుతానని అర్థించి ఆర్థించి గేలికి గుర్రై అవమానాలకు తలవొగ్గి ఊరొదిలిపోయాడో ఎవరికీ తెలియదు.

పట్నం వదిలిపోయిన సంగీతరావుకి రాగిణి విదేశీయానం తెలియదు అసలు రాగిణి పేరుతప్ప సంగీతం తప్ప మరో విషయమేదీ అతని మనస్సులో లేవు.

పూర్తిగా వయస్సు మీదపడి చూపూ, మెదడూ మందగించిన సంగీతరావుకి స్వరం మాత్రం మందగించలేదు. కానీ మతిలో స్థిరత్వం తప్పింది.

మౌనంగా గుండెలో నింపుకొన్న అనుబంధ దుఃఖంతోటే న్యూయార్కులో దిగింది రాగిణి. అప్పటికే తన ముఖ చిత్రంతో పెద్దపెద్ద స్తుతివాక్యాలతో ప్రధాన వీధులలో వేలాడుతూన్న ప్రకటనల బేనర్లు కార్లో వెళుతూంటే రెపరెపలాడుతూ స్వాగతమిచ్చాయి.

"ఇవన్నీ చూసుంటే మామయ్య ఎంత గర్వపడేవాడో?" పైకే అంది రాగిణి.

"అన్నయ్యకా అదృష్టం లేదు" ముక్తసరిగా అంది మాణిక్యాంబ. ఆ గొంతులో ఏ బాధా కనిపించలేదు.

రాగిణి ఆశ్చర్యపోయింది. "అమ్మా! అంది విడ్డూరంగా.

"తిక్కతిక్క ఆలోచనలతో మనసు పాడుచేసుకోకు రాగూ! ఇక్కడ నీ కచేరీ ఫెయిలయిందో... మనం మళ్ళీ తలెత్తుకు మన దేశంలోనే తిరుగలేం. కాస్సేపు మీ మామయ్యని మరచిపో" కర్కశంగా అంది మాణిక్యాంబ.

'నాకు సంగీతభిక్షను పెట్టి ఈనాడింత ఉన్నత పథానికి చేర్చిన గురువుని ఆత్మీయుణ్ణీ మరచిపోవటమా? క్షణమా? యుగాలయినా జన్మాలయినా మరవగలనా? అయినా యిన్నేళ్ళు చేసింది మరచిపోవటం కాదా! కృతజ్ఞత యిదేనా? ఇలాంటప్పుడు మాత్రమే గుర్తుచేసుకోవటం అంటే స్వార్థమూ అహమూ కావా! నో! ఏమైనా... ఇకమీదలా కారాదు' అనుకోంటూండగానే కారు 'ఫారెస్ట్ థియేటర్'వద్ద ఆగింది.

న్యూయార్కు ఆంధ్రకళాసంఘం వాళ్ళకు ముందే తెలిపివుంటంవల్ల వాళ్ళు వచ్చి సాదరంగా స్వాగతం పలికి వసతి ఏర్పాటుచేశారు.

సాయంత్రం ఆరుగంటలు. ఫారెస్ట్ థియేటర్ ఆడిటోరియం క్రిక్కిరిసిపోయింది శ్రోతలతో.

రాగిణి ముందు గురుస్తుతిచేసి వినాయకస్తుతి కీర్తనతో కచేరీ ప్రారంభించింది. ఆ భారతీయ శాస్త్రీయ సంగీత స్వరమాధుర్య సుధావర్షంలో మునిగిపోయిన న్యూయార్కు ప్రజలకు కాలం కనబడలేదు

ఇళ్ళలో టివిలలో ఆ కచేరీ వింటున్న వాళ్ళుసైతం మాటిమాటికీ కరతాళ ధ్వనులు చేసారు.

అక్కడినుండి రాగిణి జైత్రయాత్ర వాషింగ్టన్ టివిలోకి కదిలింది. ఆమె అద్భుత రాగజ్ఞానం, స్వరమాధుర్యం ఐ.రా.స జనరల్ అసెంబ్లీలో కూడా కచేరీ ఏర్పాటుచేసి శిరాలనివిపించేలా చేశాయి.

సభ్యప్రపంచమంతా రాగిణిని గాన కోకిలగా వర్ణించి బిరుదమిచ్చి ఘనంగా సన్మానించింది.

కెనడా, అక్కడినుండి సరాసరి యూరపులో సంగీతయాత్ర ప్రారంభిం చింది. తన సంగీతం విశ్వశాంతినే అభి లషిస్తుందనీ, కళలకు ఎల్లలు లేవు, భాషలు లేవు కనుకే తన భాషయేదో, తన సంగీతజాతియేమో అక్కర్లే కుండానే శ్రోతలు ముగ్ధులై మైమరచిపో గలుగుతున్నారనీ, దీనికంతా తన గురువు బంధువు అమృతమూర్తి సంగీత రావే కారణమనీ సభాముఖంగా విశ్వ శాంతినీ సౌభ్రాత్రాన్నీ పేర్కొంటూ ఆలాపన మొదలుపెట్టేది.

టివి ఇంటర్వ్యూలూ, రేడియో ఇంటర్వ్యూలూ కొల్లలుగా సాగాయి.

"ఎవరా సంగీత రావు? ఎక్కడతను? మీ వెంట ఎందుకు లేరు? రాలేదు?" అనేవి చివరి ప్రశ్నలు.

"అతనో విచిత్ర వ్యక్తి" అని మాత్రమే జవాబు

విదేశీయాత్ర అయిపోయింది. సురక్షి తంగా స్వదేశం చేరారు. ఢిల్లీలో ఓ ప్రసిద్ధ కార్ల కంపెనీ యజమాని ఓ అంద మైన కారుని బహూకరించాడు.

మద్రాసుకు సరాసరి వెళదామంది మాణిక్యాంబ. రాగిణేమీ పలుకలేదు. గుంటూరు నుండి కారు బయలుదేరగానే "ఊరు పోనివ్వు" అంది డ్రైవర్‌తో.

ఆ మాటలో శాసించిన వైనం వుంది. మాణిక్యాంబ కూడా మరేమీ బదులు చెప్పాలనుకోలేకపోయింది.

ఊరు సమీపంలోకి రావడం...చిర పరిచితమైన కంఠం వినడం...

"మామయ్యా! ఏమిటీ...ఏమిటీ స్థితి? ఒక్క కార్డు రాయలేకపోయావా? నీ కంటే నాకు ఢిల్లీ, అమెరికాలూ కచే రీలూ కీర్తీ ఎక్కువా మామయ్యా? అయ్యో! మరో...మరో త్యాగబ్రహ్మ వైనావే మామయ్యా!" అంటూ ఏడ్వ సాగింది, ఆయన శరీరమంతా నిము రుతూ.

సంగీతరావు కళ్ళు ఎంతో గర్వంతో మిలమిల మెరిసిపోతూ రాగిణివైపే చూస్తూ ఆనంద బాష్పాల్నే వర్షి స్తున్నాయి.

"మామయ్యా!" ఆదుర్దాగా అతని కళ్ళలోకే దీనంగా జాలిగా ప్రార్థనగా చూస్తూ అనింది రాగిణి.

"నాదా... త్తనుమనిశం..." అంటూ అలానే రాగిణి మీదకు వాలిపోయాడు.

ఆయన ప్రాణాలు అనంతవాయు వుల్లో కలిసి సంగీత ఝురుల్ని ఆ ప్రాంతమంతా నింపాయి. **